# మంత్ర ముగ్ధుల్ని చేసిన అవధానం



అవధాన కార్యక్రమంలో ప్రసాద్ తోటకూర తదితరులు

ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘంకు చెందిన సాహిత్యవేదిక ఆధ్వర్యంలో అవధాని శిరోమణి నరాల రామారెడ్డి అష్టావధానం డల్లాస్ నగరంలో రసవత్తరంగా జరిగింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) కార్యదర్శి ప్రసాద్ తోటకూర సంచాలకులుగా, ఆచార్య పూదూర్ జగదీశ్వరన్ సంధానకర్తగా వ్యవహరించిన ఈ అవధానంలో రామారెడ్డి ఛందోబద్ధ కవిత్వంతో ప్రవాసాంధ్రుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. పృచ్ఛకురాలు కన్నెగంటి మంజులత కందిపచ్చడి మీద ఆశువర్ణన చేయమనికోరగా, "కందిపచ్చడి రుచి విలక్షణమ్ము" అంటూ అవధాని చెప్పిన తేటగీతి పద్యం శ్రోతల కరతాళధ్వనుల్నిఇ అందుకుంది. దత్తపది అంశంలో భాగంగా ఎం.పి.ఎల్. ప్రసాద్ అత్త, దుత్త, మెత్త, నత్త అనే పదాలు వాడుతూ అమెరికా విశేషాల్ని వివరించమనగా, గుండెలో నత్తరు పూసినది ఆకురాలు మనోజ్ఞ కాలమై' అంటూ అమెరికాలో శిశిర ఋతువును వర్ణిస్తూ అవధాని చేసిన వర్ణన ప్రేక్షకులను అబ్బురపరిచింది. రమణ జవ్వాడి పృచ్ఛకుడిగా వ్యవహరించిన నిషిద్ధాక్షరి అంశంలో గంగానదిని కీర్తిస్తు చెప్పిన పద్యం, చిలుకూరి వేంకటశాస్త్రి అడిగిన ప్రశ్నకు అమెరికాలోని హిమపాతాన్ని వర్ణించిన పద్యం సభికుల్ని ఆకట్టుకున్నాయి. ఆచార్య బండ్ల రాగయ్య, భద్రిరాజు మూర్తి తదితరులు పృచ్ఛకులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో శ్రీధర్ కొరసపాటి ఘంటాగణన, కె.సి. చేకూరి అప్రస్తుత ప్రసంగం నిర్వహించారు. లేఖకులుగా భాస్కర్ రాయవరం, కిరణ్, జవ్వాది రఘునాథరావు వ్యవహరించారు. అవధానం అనంతరం తెలుగు సంఘం అధ్యక్షురాలు శ్యామల రుమాళ్ళ, ఉపాధ్యక్షురాలు చంద్రశేఖర్ కన్నెగంటి అవధాని రామారెడ్డిని సత్కరించారు. కార్యక్రమ నిర్వహణలో సహకరించిన రావ్ కల్వల, పులిగండ్ల విశ్వనాథం, సుభాష్ నెలకంటి, సురేష్ మండువ, విజయ మోహన్ కాకర్ల, రాజేష్ పిల్లమఱ్రి, వెంకట్ ములుకుట్ల, మురళి వెన్నం తదితరులకు సంఘం తరుపున కె.సి. చేకూరి ధన్యవాదాలు తెలిపారు

